# ఆడవాళ్ళూ! మీరు! మీరు!!



ఆదిమధ్యం రమణమ్మ

వేడి గాడ్పు విసిరి కొట్టినట్లు అయింది.

వడగళ్లవాన ముఖాన్ని మొత్తినట్లు అయ్యింది,

ఉప్పెనలో ఉక్కిరి బిక్కిరై ఆకాశ మెత్తున ఎగిరి, కొట్టుకు పోయినట్లు లయింది.

కలకత్తా బడాబజారులో ట్రాముల రణగొణ ధ్వనులకు చెవులు చిల్లులు బడినట్లు అయింది.

ఇన్నీ జరిగినట్లు అనుభూతి కలగ డానికి కారణం ఎదురింటి తాయారమ్మ గారు గాలి విసురుగావచ్చి "రచ యిత్రిగారూ నాకు రంకుతనం చేయా లని ఉందండీ" అనడం.


ముందు గదిలో ఈజీ చైర్‌లో విశ్రాంతిగా మేనువాల్చిన నాకు విభ్రాంతి కలగడంలో ఆశ్చర్యమేముంది?

తెల్లబోయి చూస్తున్న నా చూపుకి గాని, నా ముఖ కవళికల్నిగాని, ఆవిడ పట్టించుకున్నట్లులేదు.

ఎదురుగా ఉన్న కుర్చీలో కూలబడి ముఖం తుడుచుకుని ఆవేశంలో తన ధోరణిలో తాను చెప్పుకుపోతోంది-

"చిన్ననాటి మిత్రునితో చేద్దామంటే వాడొట్టి అమాయకుడు. వాడి పట్ల స్నేహభావమేగాని మరోటి లేదు. పోనీ పెళ్లాడాలనుకున్న బావతో చేద్దా మంటే బావపట్ల అభిమానమే తప్ప మోహం ఎంతమాత్రం రావడంలేదు. పోనీ ఈయన పరిచయస్తులు ఏ వ్యక్తితో అయినా ప్రేమ కలాపం సాగిద్దామంటె ఛీ! ఛీ! వాళ్లపట్ల గౌరవ భావం తప్ప మరో భావం వచ్చినా పుట్టడంలేదు. ఎట్లాచచ్చేది? ఎవరిలో నేననుకున్నపని సాధిం చేది?"

అక్కకాడిధోరణి ఆపి నాకేసి పరిశీలనగా చూసింది. నా వెర్రి చూపులు చూసి ఏమనుకుందో- తానన్న మాటలకి ఏమి బిడియం తోచిందో. "మీరేం చేస్తారు నా కర్మకి" అని వో నిట్టూర్పు



విడిచి వచ్చినంత వేగంగానూ వడి వడిగా అడుగులేస్తూ వెళ్లిపోయింది.

తెలివి తెచ్చుకుని "ఇదిగో కాయా రమ్మగారూ మాట" అని నేను నోరు విప్పి పిలిచేసరికి ఆవిడ తన గుమ్మం దాటేసి తలుపులు దబాలున మూసేసుకుంది.

దీర్ఘంగా ఒక నిట్టూర్పు విడిచి విశ్రాంతినొంది నెమ్మదిగా కోలుకుని ఆలోచన మొదలు పెట్టాను.

'ఆవిడ మాటల్లో ఆవిడ మనో నైర్మల్యం సుళువుగా సుబోధ మవుతోంది. ఆవిడ శీలవతి. మన సంస్కృతీ సంప్రదాయాలు రక్తంలో బాగా జీర్ణించి ఉన్నాయి. ఆవిడ మనసు దేనికో గాయపడింది. అందుకలా మాట్లాడింది. మాటల్లోకూడా చెడ్డపని చేయడాని కావిడ కెవరూ దొరకలేదు! మనసురాలేదు. వోహో! చిత్రంగా ఉంది.

ఎవరికైనా భర్తమీదా, పిల్లలమీదా, సంసారం మీదా కోపంవస్తే పుట్టింటికి పోతామనో, చస్తామనో అంటారుగాని, కాయా రమ్మగారిలా అనరు. అందుకే ఆవిడ మాటలు నన్ను తబ్బిబ్బు చేసాయి. మతి పోగొడుతున్నది.

'ఎందుకలా అందావిడ? అందరి సంసారాల్లో ఉన్నట్లే ఆవిడ సంసారంలోనూ కలతలు కన్నీళ్లు వుండొచ్చు ఆర్థిక ఒడ దుడుకులు ఇబ్బందులు ఉండే ఉండొచ్చు. కాని అన్నిడకోపం ఇలా రూపొందడానికి కారణమేమిటి?"

నేను కాపరానికొచ్చినప్పటినుంచీ కామేశంగారూ, నాకు తెలుసు. ఆయన తండ్రి మురళీధరంగారూ తెలుసు. కామేశం ఆయనకి ఏకైక పుత్రుడు. అప్పటికింకా పెళ్లికానేగు వాడికి మురళీధరంగారి భార్య ఏనాడో పోయింది. మళ్లీ పెళ్లి చేసుకుంటే చికాకులొస్తాయనో లేక ఇంట్లో భోజనముండేది ఫలహారంపైన చేస్తే ఏం పోయిందనో. ఆయన మనసు ఆలోచనలు ఏమో తెలియదుగాని, ఆమేష్టారుగిరీ చేస్తూనే కామేశాన్ని ముద్దుగా పెంచి పెద్ద చేసారు. కామేశమూ బుద్ధిగానే చదువుకొని డిగ్రీ పూర్తిచేసి ట్రైనింగ్ అయి, అతనూ టీచరు పని చేస్తున్నారు. ఒకటి రెండుసార్లు. వంటావిడనూ తెచ్చారు. కొడుకు అలిగి స్టూడెంటుతో కలిసి వేరేగదిలో ఉంటూ వచ్చాడు.దాంతో ముసలాయన కొడుకు ఎక్కడ కుర్రాళ్లతోకలిసి పాడైపోతాడో అని వంటావిణ్ని వదిలి మళ్లీ వంట ప్రారంభించి కుర్రాణ్ణి ఇంటికి రప్పించేసాడు.

యెందుకో అడ్డుగోడ పెట్టించి, ఇంటిని రెండు వాటలుగా మార్పించాడు.

ఒక వాటాలోకి ఒక కుటుంబాన్ని తెచ్చాడు. వాళ్లు మరో రాష్ట్రంవాళ్లు. ఆ విడ ముగ్గురు పిల్లల తల్లి. చాలా అందంగా ఉండేది. కామేశం ఆవిడ చుట్టూ తిరుగుతూ ఉండేవాడు. వాళ్ళ పిల్లల్ని ఆడించాడు. అతడప్పుడు పేచీలు పెడితే బడికి తీసుకువెళ్ళడం, కూరలు అవీ తెచ్చిపెట్టడం, ఆవిడకు తెలుగు, చదవడం వ్రాయడం నేర్పడం. ఇహ ఆమె భర్త ఇంట్లో ఉన్న సమయాల్లో

ఒకలా, లేనిసమయాలు ఒకలాగా వాడు కునేవాడు. ముఖ్యంగా వాళ్ళ కుటుం బాన్ని ముఖ్యంగా ఆవిడ్ని రాసుకు పూసుకు తిరగడమే గాక, నవ్వులు పువ్వుల జల్లుల్లా కురిసేవి.

ఇదంతా ముసలాయన పసికట్టి, మామగారి దగ్గర కొచ్చి, వాపోయే వాడు. "ఏంటా కుర్రాడు. వెధవ బుద్ధులూ వీడూను. నలుగురు పిల్లల తల్లితోనా" అని వాపోయేవాడు.

"ఏదో కుర్రాడు. అర్థాలు తీయ కండి. సరదాకి అలా చేస్తున్నాడేమో" అనేవారు తన మామగారు.

"సరదానా అదేం సరదానో - నే పోల్చలేనా?" అని నాలుక కరుచుకునే వారు.

చూసి చూసి చివరికి విసిగి కొడుక్కి పెళ్ళి చేసేసారు.

ఆ ఇంట్లో కాపుర మున్నవాళ్లు కొన్నాళ్ళకు వెళ్ళిపోయారు.

ఆవిడకి ముగ్గురు పిల్లల తరువాత పుట్టిన కొడుకు అచ్చం కామేశంలాగే ఉండేవాడు.

కోడలు వచ్చాక మురళీధరుగారు ఎన్నో రోజులు సుఖించలేదు. బ్రతక లేదు.

కామేశానికి ఇపుడు ఇద్దరమ్మాయిలు ఒక కొడుకూను. ఇద్దరమ్మాయిలకీ చిన్నతనంలోనే పెళ్ళి చేసేసాడు. కొడుకు చిన్నవాడు. చదువుతుంటు న్నాడు. ఆడపిల్లల పెళ్ళిళ్ళకి అప్పు లయ్యాయి. తీరుస్తున్నాడు.

వాళ్ళ తరువాత ఆ వాటాలోకి ఎన్నో కుటుంబాలు అద్దెకు వచ్చారు. వెళ్ళారు. ఏ గొడవలూ లేవు.

కాని తాయారమ్మగారు పనిమనిషిని రెండు నెలలకొసారి మార్చేస్తూండేది. భర్త గురించి ఎప్పుడూ చెప్పుకోదగ్గ దేం చెప్పలేదు. ఆర్థిక ఒడుదుడుకుల గురించే చెప్పేది. ఇవ్వాళ ఏంటా విప రీతం? ఏం జరిగుంటుంది?

కళ్లు మూసుకుని, అలా ఎంతసేపు ఆలోచిస్తూ పడుకున్నానో - కళ్లు తెరిచే సరికి ఎదురింటికి తాళం వేసి ఉంది. పక్కవాటాలో ఓ మామ్మగారు మనమ రాలు కాపురం ఉంటున్నారు. ఆ అమ్మా యికి పదిహేను పదహారు సంవత్స రాలు ఉంటాయి. టెన్త్ ప్యాసై టైపు నేర్చుకుంటోంది. ఆ పిల్లకి కట్నమిచ్చి పెళ్ళి చేసే స్థితిలో లేరు. ఉద్యోగం చేయించాలనుకొంటున్నారు. ఆ డబ్బు తో మరో వూర్లో ఉన్న కొడుకు కుటుంబానికి వేన్నీళ్లకు చన్నీళ్లు, సహా యంగా ఉంటుందని ఆ తాపత్రయం. అతనిది పెద్ద కుటుంబం తక్కువ ఆదాయమూను.

ఒళ్ళు విరుచుకుని లేచాను.

బామ్మగారింటికి వెడితే ఆవిడ అలా ఎందుకన్నదో కొంత సమాచారం రాబట్టవచ్చని.

వీధి తలుపు లోపలకేసి ఉంది. దొడ్డితలుపు జేరవేసి ఉంది. దాసీది వచ్చి వెళ్ళిపోయి ఉంటుంది. తలుపు వేయడం మరచిపోయి ఉంటుందని లోపలికి ప్రవేశించాను.

ఆ ఇల్లు వ[illegible] ఇటు మూడు

గదులు అటు మూడు గదులు కలది. రెండుప్రక్కలా సన్నసందూ వెనక వైపు కాస్త పెరడు. మూడు వైపులా ఇంటినానుకుని చిన్న అరుగు. వెనక వైపు కాస్త విశాలంగా ఉంటుంది అరుగు.

బామ్మగారి ఇంటి తలుపులన్నీ బిడా యించి ఉన్నాయి. దొడ్లో వడియాలు ఎండబెట్టబడి ఉన్నాయి.

ఎందుకు పుట్టిందో దుర్బుద్ధి. వెనక వైపునుంచి చుట్టు తిరిగి, తాయారమ్మ గారి ఇంటివైపు వచ్చాను. ఆ చిన్న అరుగుమీద, గది కిటికీ దాకా వచ్చి టక్కున ఆగిపోయాను.

గది కిటికీ తెరిచే ఉంది. కానైతే కర్టెను ఉంది. లోపల నుంచి గుస గుసలు - తాయారమ్మగారు కాదు. బామ్మగారి మనుమరాలు, కామేశం.

కిటికీ ఓవైపు - పక్కకొసనుంచి, పెనవేసుకున్న నాలుగు కాళ్ళు కని పించాయి.

గుండె, లయ తప్పింది ముచ్చె మటలు పోసాయి. స్థాణువులా నిల బడిపోయాను. సిగ్గుతో శరీరం చచ్చి పోయింది నేనే ఆచర్య చేస్తున్నా నేమో అనిపించి, శరీరం నిలువెల్లా కంపిస్తుంటే—అక్కడనుంచి గజానికో అడుగుగేస్తూ గబగబా ఇంటి కొచ్చి పడ్డాను.

పెద్ద గదిలో కుర్చీలో కూర్చోబోవడాని కూడా జంకు కలిగింది. వంట ఇంట్లోకి వెళ్ళి గ్లాసుడు మంచినీళ్ళు తాగి కాస్త స్థిమితపడి ముందు గదిలో కొచ్చి, మళ్లీ అదే చైర్‌లో తోటకూర కాడలా డీలాపడి వాలిపోయాను.

బామ్మగారు' తాయారమ్మగారు ఏమై నట్లు ?

ఆ, అన్నట్లు వీళ్లు రోజూ రెండు గంటలకి శివాలయంలో పురాణానికి వెళ్ళి, నాలుగు గంటలకి వస్తున్నారు. తను కళ్లు మూసుకుని ఆలోచనలో ఉండటంవల్ల వాళ్లని గమనించలేదు.

ఇంట్లో మనుమరాలు జాగ్రత్తగా ఉన్నదనుకుంటోంది కాబోలు బామ్మ గారు. కొందరు ఆడపిల్లలకి బైటికెడి తేనే ప్రమాదం ఇంట్లో ఉంటే ప్రమా దం ఉండదనుకుంటారు. కామేశం గారు స్కూలు ఎగ్గొట్టి వచ్చేసి ఉంటారు.

చటుక్కున ఏదో గుర్తుకొచ్చింది. తాయారమ్మగారి కంట పడకూడదీ సంగతి అని. మూసిఉన్న కళ్లు పత్తి కాయల్లా తెరిచిపెట్టుకున్నాను. అయినా ఆపిడకి తెలిసే అలా విరక్తిగా మాట్లా దేదేమో. ఏమైనాకాని తాళం వేసిన వీధి గుమ్మం కేసి కా వ లా కాస్తున్నట్లు చూస్తూ కూర్చున్నాను.

అనుకున్న టైము కంటె ముందే తాయారమ్మ గారొచ్చింది. బామ్మగారు రాలేదు.

అలా అన్నా ఆవిడ ఖాతరు చేయ లేదు.

వెనక్కి తిరిగి నవ్వుతూ లోపలి కెళ్ళిపోతూ - "తరువాత వస్తా" నని తలుపు బిడాయించేసింది.

నాగుండె ఆగినంత పనయింది.

పని చేస్తున్నా తిండి తింటున్నా ప్రక్కమీదకు వాలినా నా మనసు మన సులో లేదు. నా చూపు దేనిమీద నిలవ టంలేదు. పనులన్నీ పూర్తిచేసి ప్రక్క మీద వాలి ఆయనకి ఈ విషయం చెప్ప నా మాననా అని ఊగిసలాడుతూ గడిపాను.

కామేశంగారు, మామ్మగారి మనుమ రాలు, వారి మాటలు చర్యలు. వాటి వెనుకగల బలహీనతలు, బలమైన ఆకాంక్షలు. తాయారమ్మగారి దుస్థితి. ఆవిడ మాటలు. నేటి సమాజము, అది నడుస్తున్న తీరు, స్త్రీపురుషుల అను బంధము. స్త్రీల హీనస్థితి. నైచ్యం, తెలివితక్కువ పనులు తలలో తిరిగి తిరిగి- చాలా రాత్రి వరకు నిద్ర లేకుండా చేసాయి.

తెల్లవారిలేచి బాత్‌రూం కెళ్లి ముఖం కడుక్కొని వచ్చేసరికి ఎదురింటినుంచి ఘొల్లుమని ఏడుపులు.

ఏదో జరుగుతుందను కున్నానుగాని చావు ఏడుపులు వినవస్తాయని అనుకో లేదు.

వెళ్లిచూస్తే ఏముంది. తాయారమ్మ గారు శవమై ఉంది. నిద్రపోతున్నట్లు ఉంది. ఆవిడ కొడుకు "నిద్రమాత్రలు మింగింది అమ్మ" అని ఇవతలికి పిలిచి చెప్పాడు.

ఆవిడకి బ్లడ్ ప్రెషర్ ఉంది. రోజుకో నిద్రమాత్ర వేసుకుంటుంది. ఆ మాత్రలన్నీ జమచేసి ఒకేసారి మింగి ఉంటుంది.

బామ్మగారు శవాన్ని చూసి వెళ్ళి పోయినట్లుంది. తనవాటాలో ఏడు స్తోంది. ఆవిడ వాటాలోకి వెళ్లాను. ఆవిడ మనుమరాలి బుగ్గలు ఎవరో కొట్టినట్లు కొద్దిగా వాచి ఉన్నాయి.

ఆ అమ్మాయి ఏడుస్తూ "తాయా రమ్మగారెంతో మంచివారండీ ఆవిడ నగలు. నా పెళ్లికని ఇచ్చారండీ" అంది.

"ఛీ ఛీ. నోరు ముయ్యి ఈమాటె క్కడా అనకు" అని మామ్మగారు కసిరింది. మామ్మగారి మనుమరాలు మాటల్లో ఆమె అమాయకతల్లి ముక్కు పచ్చలారని ఆమె తెలిసీ తెలియని దనం.... జరిగిన దేమిటో - వెంటనే బుద్ధికి తట్టలేదు

ఈ దుస్సంఘటనని ఊహించ నందుకు. ఏ విధంగానూ అడ్డుకోలేక పోయినందుకు. నన్ను నేను తిట్టు కుంటూ ఇంటికి చరచరా వచ్చేసాను.

"మామ్మగారి దొంగ నగలిచ్చెయ్య మందీ అంటే, కోడల్ని చేసుకోవాలనా ఛీ.. అలాంటిపని ఎప్పటికీ తాయా రమ్మగారు చెయదు - తన భర్తనే రెండోపెళ్ళి చేసుకొమ్మనా? ఛీ. ఛీ. అలాంటి సూచన ఎప్పటికీ చెయదు 'బాలలాంటి అమ్మాయిలకి తొందరగా పెళ్లి చేసేస్తే మంచిదని- సానుభూతి తోనే ఇచ్చి ఉండొచ్చు. ఎప్పుడిచ్చిందో ఎలా ఇచ్చిందో- మామ్మగారెందుకు చెబుతుంది? చెప్పడానికి తాయారమ్మ గారు లేదు. ఆవిడ మాత్రం నాకిగ్గ చెప్పిందని చెప్పిఉంటే తానేదైనా ఈ సమస్యకి పరిష్కారం చేసును.

అదెంతమాత్రం జరిగే అవకాశ మియ్యకుండానే- ఆవిడకెంత బాధ కలిగిందో-

ఛీ. ఛీ- కాదు. ఈ ఆడవాళ్ళకి బుద్ధిరావడంలేదు ఎన్ని యుగాలకి. వెధవ చెత్త పనులు వీళ్లూను. తాయారమ్మగారు చావడమెందుకు? మామ్మగారి చేత ఇల్లుకాళీ చేయిస్తే పోయేది. భర్త తప్పు చేస్తే శిక్ష తాను కోరుకోవడమెందుకు? నడుస్తానంగా చూపిచూడనట్లు ఊరుకుంటే పోయేది. మానసింగా అతణ్ణి విసర్జిస్తే పోయేది- ఈవిడేకాదు. ఎందరో స్త్రీలు ఇట్లానే చేస్తారు. సమస్యలు వేరు వేరు. ఎవరో చేసిన తప్పుకు తమని శిక్షించుకుంటారు. జీవితంలో వోడిపోతూ ఉంటారు. ఏమాత్రం పోరాటం సాగించకుండా వోటమిని వరిస్తూ వోటమిని కౌగలించుకుంటూ తమని తామే నాశనం చేసుకుంటూ అంతం చేసుకొంటారు. తెలివి తక్కువ అమాయకస్త్రీలే కాదు- చదువుకుని డిగ్రీలు సంపాదించుకున్నవారు చేస్తూ వుంటారు. ఇదే వాళ్లకి తెలిసినదారి. అలివాటూను. మగవాడి ప్రేమకి ముష్టి ఎత్తుతారు. ఆ పైై భంగపడి చస్తారు. అసలు ముష్టెత్తడమెందుకు?

మామ్మగారి బాలకి ఈ బాలా కుమారుడే కావలసి వచ్చాడా? కామేశంగారి కొడుకుతో ప్రేమ సాగించడానికి బామ్మగారు అవకాశం ఇచ్చి ఉండదు. కామేశంగారు- పసిదానికి- రుచులు మప్పి చాపల్యం తీర్చుకుని ఉంటారు. "కామేశంగారూ మీరిద్దరూ చేసిన పనికి ఒక నిర్దోషి బలి అయిపోయింది. మీకు మీలాంటి వారికి- ఇలాంటి బలిదానాలవల్ల బుద్ధివస్తుందా? రాదు. ముమ్మాటికీరాదు. బుద్ధి తెచ్చుకోవలసిన వారు వేరే ఉన్నారు."

'ఆడవాళ్ళూ మీరు మీరు- సంపాదించవలసినది ముఖ్యంగా డిగ్రీలు, డబ్బూ కాదు జ్ఞానం.

పిచ్చి సెంటిమెంట్స్‌తో— అణిచివేయబడ్డ ఆ వేశంతో బాధను కొని తెచ్చుకోకండి. బ్రతకడం బ్రతుకును బాగు చేసుకోవడం నేర్చుకోండి. ఒక విధంగా పురుషుడు అజ్ఞాన-బలహీనలతో తన స్వేచ్ఛను దుర్వినియోగం చేసుకుంటూ కొట్టుకు పోతున్నాడు- మీరు తల్లులు కాదా-ఉగ్గు పాలలో అతన్ని తీర్చిదిద్దలేరా? అసలు మీ పద్ధతులు అలవాట్లు మార్చుకోండి.మార్చుకోండి.

నా ఆక్రోశం-అది-

కామేశంముఖం చూడ్డాని కసహ్యం వేసి ఛడాలన వీధి తలుపు మూసేసాను.

కామేశాల్ని బాలల్ని-తయారమ్మల్ని ఎందర్నో చూడగా - నా మనసులో ఈ తాయారమ్మ తయారయింది. ★